క్లుప్తంగా

సత్ప్రవర్తనతో మెలిగితే రౌడీషీట్ ఎత్తివేస్తాం



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ

ప్యాపిలి: రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఎస్ఐ మధుసూదన్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీషీటర్లు తమ కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని మంచి ప్రవర్తనను అలవర్చుకోవాలన్నారు. అసాంఘిక చర్యలకు పాల్పడినా, నేరాలకు పాల్పడినా రౌడీషీటర్లపై చర్యలు మరింత కఠినంగా ఉంటాయన్నారు. ప్రవర్తన మార్చుకుంటే రౌడీషీటర్ నుంచి వారి పేర్లు తొలగిస్తామన్నారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి



కాశీం(ఫైల్)

కోవెలకుంట్ల: మండలంలోని గుంజలపాడులో విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్(వీఆర్‌ఏ)గా పనిచేస్తున్న కాశీం (61) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కోలుకోలేక మృత్యువాతపడ్డారు. విషయం తెలిసిన వెంటనే వీఆర్‌ఏల సంఘం నాయకులు శివరాముడు, రమణ, నాయుడు, బాషా, ఉసేని, రమేష్, తదితరులు గ్రామానికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు. అంత్యక్రియలకు వీఆర్‌ఏ సంఘం రూ. 5 వేలు ఆర్థికసాయం అందించింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు

కొలిమిగుండ్ల: బెలుం శింగవరం సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వివరాలు..బెలుంకు చెందిన సుబ్బు, గాయత్రి బైక్‌పై గోవిందిన్నెకు బయలుదేరారు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొనడంతో ఇద్దరు కింద పడ్డారు. గాయత్రి చెవి కట్ కాగా సుబ్బు కాళ్లకు గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు క్షతగాత్రులను చికిత్స కోసం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు.

చౌకదుకాణాల్లో రేషన్ పంపిణీ ప్రారంభం



రేషన్ పంపిణీని ప్రారంభిస్తున్న మంత్రి బీసీ

బనగానపల్లె రూరల్: పట్టణంలోని చౌకదుకాణం–3లో రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నెలా 15వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మళ్లీ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ దుకాణాల్లో నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తారని తెలిపారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాగా చాలా గ్రామాల్లో ఉదయం నుంచే సర్వర్లు మొరాయించడంతో లబ్ధిదారులు దుకాణాల వద్ద ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. తహసీల్దార్ నారాయణరెడ్డి, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

డోన్ టౌన్: యాచకుడిగా జీవనం సాగిస్తున్న గుర్తు తెలియని వ్యక్తి శనివారం డోన్ రైల్వేస్టేషన్‌లోని నాల్గో ప్లాట్‌ఫాం ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై చనిపోయాడు. గుర్తించిన రైల్వే పోలీసులు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి అంత్యక్రియలు చేయాలని ద్రోణాచలం సేవా సమితిని కోరారు. దీంతో సమితి సభ్యులు స్థానిక పాతపేట శ్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. ఇందుకు ప్రొద్దుటూరుకు చెందిన చరణ్‌తేజ్‌రెడ్డి ఆర్థిక సాయం చేశారు. షాదిఖానా రాజా, గురుస్వామి, తాహెర్‌బాషా, ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.

రౌడీషీటర్ల కదలికలపై నిఘా



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ

కోవెలకుంట్ల: రౌడీషీటర్ల కదలికలపై నిఘా కొనసాగుతుందని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం వాటిల్లేలా ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీషీటర్లు నేర ప్రవృత్తికి స్వస్తి చెప్పి జన జీవనంలో కలిసిపోవాలన్నారు. రౌడీషీటర్లుగా నమోదైన వ్యక్తులు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉన్నట్లు పోలీసు విచారణలో తేలితే వారిపై షీట్ ఎత్తివేస్తామని పేర్కొన్నారు.

రేషన్.. పరేషాన్

- డోర్ డెలివరి రేషన్‌ను రద్దు చేసిన కూటమి ప్రభుత్వం
- తొలి రోజే మొరాయించిన సర్వర్లు
- కార్డుదారులకు మొదలైన కష్టాలు
- చౌకదుకాణాల వద్ద గంటల కొద్దీ నిరీక్షణ
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ లబ్ధిదారులు



సంజామల మండలం ఆకుమల్లలో రేషన్‌షాపు వద్ద సరుకుల కోసం వేచి ఉన్న కార్డుదారులు

కోవెలకుంట్ల: ఐదేళ్లపాటు ఎలాంటి కష్టం లేకుండా ఇంటి వద్దనే రేషన్ అందుకున్న కార్డుదారులకు జూన్ నెల నుంచి కష్టాలు తిరిగి మొదలయ్యాయి. కూటమి ప్రభుత్వం డోర్ డెలివరి వ్యవస్థను రద్దు చేసి ఆదివారం నుంచి చౌకదుకాణాల ద్వారా నిత్యావసరాల పంపిణీకి శ్రీకారం చుట్టింది. నియోజకవర్గంలోని బనగానపల్లె, కోవెలకుంట్ల, అవుకు, సంజామల, కొలిమిగుండ్ల మండలాల పరిధిలో 209 నిత్యావసర చౌకదుకాణాలు ఉండగా 88,698 రేషన్‌కార్డుల్లో 2.59 లక్షల మందికి ప్రతి నెలా బియ్యం, చక్కెర, తదితర నిత్యావసరాలు అందించాల్సి ఉంది. కార్డుదారులు ప్రతి నెలా చౌకదుకాణాలకు వచ్చి రేషన్ తీసుకోవడంలో తలెత్తే ఇబ్బందులు, సరుకుల పంపిణీలో అవినీతి, అక్రమాలు అరికట్టేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2021 ఏడాది నుంచి ఎండీయూ(మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్) ద్వారా ఇంటి వద్దకే రేషన్ సరఫరా చేసింది. ప్రతి నెలా కార్డుదారులు ఇంటి వద్దనే బియ్యం, చక్కెర, కందిపప్పు, గోధుమలు, రాగులు, జొన్నలు, తదితర నిత్యావసర సరుకులు తీసుకునేవారు. అప్పటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం 2027 వరకు డోర్ డెలవరికి గడువు ఉంది. గత ఏడాది అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ డోర్ డెలివరి వ్యవస్థను రద్దు చేసి ప్రజా పంపిణీని తిరిగి చౌకదుకాణాలకు అప్పగించడంతో ఆదివారం నుంచి రేషన్ షాపుల్లో పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది.

కోవెలకుంట్లలో అవస్థలు

కోవెలకుంట్ల మండలంలో రేషన్‌షాపుల వద్ద రద్దీ అధికంగా ఉండడంతో కార్డుదారులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. మొదటి రోజు సర్వర్ మొరాయించడంతో కార్డుదారులు చౌకదుకాణాల వద్ద నిరీక్షించాల్సి వచ్చింది. క్యూలైన్‌లో గంటల తరబడి వేచి ఉండి సరుకులు తీసుకున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు క్యూలైన్‌లో నిలువలేక ఇబ్బందులు పడ్డారు. చౌకదుకాణాలు ఇళ్లకు దూరంగా ఉండడంతో బియ్యాన్ని సంచుల్లో వేసుకుని ఇళ్లకు చేర్చుకునేందుకు అవస్థలు పడ్డారు. మొదటి నెల చౌకదుకాణాల్లో కేవలం బియ్యం, చక్కెర మాత్రమే పంపిణీ చేశారు. కందిపప్పు, జొన్నలు, రాగులు, తదితర నిత్యావసరాలు ఇవ్వక పోవడంతో కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేశారు.

బనగానపల్లెలో సర్వర్ కష్టాలు

నియోజకవర్గ కేంద్రమైన బనగానపల్లెలో సర్వర్ పనిచేయక కార్డుదారులు రేషన్ తీసుకునేందుకు నానా ఇబ్బందులు పడ్డారు. ఇళ్లకు సుదూరంలో ఉన్న రేషన్‌షాపుల వద్దకు వెళ్లి గంటల తరబడి వేచి ఉండి సరుకులు తెచ్చుకోవాల్సి వచ్చింది. మండలంలో ఆరు మజరా గ్రామాల్లో చౌకదుకాణాలు లేవు. గతంలో ఎండీయూ వాహనాలు ఆ గ్రామానికి వెళ్లి రేషన్ పంపిణీ చేసేవారు. ఈ నెల నుంచి ఆయా గ్రామాల కార్డుదారులు గ్రామ పంచాయతీలో ఉన్న రేషన్‌షాపుకు వెళ్లి సరుకులు తీసుకోవాల్సి ఉండడంతో ఆందోళన చెందుతున్నారు. బైక్‌లు, సైకిళ్లు, ఇతర వాహనాలు లేని కార్డుదారులు మూడు, నాలుగు కి.మీ నడుచుకుంటూ వెళ్లి సరుకులు తీసుకోవాల్సి ఉంది.

సంజామల: కార్డుదారులు వ్యవసాయ, ఉపాధి పనులు మానుకుని రేషన్‌షాపులకు వెళ్లాల్సి వచ్చింది. పలుమార్లు సర్వర్ మొరాయించడంతో షాపుల వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. షాపులు ఇళ్లకు దూరంగా ఉండడంతో నిత్యావసరాలను ఇళ్లకు తరలించుకునేందుకు అగచాట్లు పడ్డారు.

కొలిమిగుండ్ల: మండలంలో రేషన్ పొందేందుకు కార్డుదారులు అవస్థలు పడ్డారు. బైక్‌లు, సైకిళ్లు ఉన్న కార్డుదారులు బియ్యం తెచ్చుకున్నారు. ఎలాంటి వాహనాలు లేని కార్డుదారులు నడుచుకుంటూ వెళ్లి సరుకులను మోసుకుని ఇళ్లకు వెళ్లారు. బియ్యం సంచిని ఇంటికి చేర్చేందుకు పడరాని పాట్లు పడ్డారు. కమ్మవారిపల్లె పంచాయితీ పరిధిలోని మజారా గ్రామం లక్ష్మంపల్లె గ్రామస్తులకు గతంలో ఎండీయూ వాహనం వెళ్లి సరుకులు అందించడంతో సులభంగా ఉండేది. ప్రస్తుతం వారి పరిస్థితి ఆగమ్య గోచరంగా మారింది. సరుకుల కోసం రానుపోను 8 కి.మీ వెళ్లాల్సి వస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో 50 మంది కార్డుదారులున్నారు. సరైన రవాణా సౌకర్యం లేదు. బైక్‌లు ఉన్న వాళ్ల పరిస్థితి బాగానే ఉన్నా లేని వాళ్ల పరిస్థితి ఏంటని కార్డుదారులు ప్రశ్నిస్తున్నారు.

బేతంచెర్ల: మండలంలో ఉదయం 8 గంటల నుంచి డీలర్లు సరుకల పంపిణీ ప్రారంభించినా సర్వర్ మొరాయించడంతో కార్డుదారులు గంటల కొద్దీ నిరీక్షించారు. వృద్ధులు, మహిళలు నిలబడలేక దుకాణం ఎదుటే కూర్చున్నారు. బేతంచెర్ల మండలంలో 45 రేషన్‌దుకాణాలు, 27,131 కార్డులు ఉన్నాయి.

అవుకు: పట్టణంలోని పలు కాలనీలకు చౌకదుకాణాలు దూరంగా ఉన్నాయి. నడుచుకుంటూ వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మహిళలు, వృద్ధులు నిత్యావసరాలు తెచ్చుకునేందుకు నానా అవస్థలు పడ్డారు. చాలా చోట్ల రేషన్ దుకాణాల వద్ద కార్డుదారులు క్యూ కట్టారు. ఇదేం ఖర్మరా బాబు.. ఇదివరకు ఇంటి వద్దకే వచ్చి రేషన్ సరుకులు ఇచ్చేవారు. ఇప్పుడు ఇలా చేసారేంటని కూటమి ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేశారు. కునుకుంట్ల గ్రామ పరిధిలోని మద్రికుంట తండాకు రేషన్ దుకాణం 15 కి.మీ, ఇస్రానాయక్ తండాకు 4 కి.మీ దూరం ఉండటంతో కార్డుదారులు ఎవరూ రేషన్ దుకాణంలో సరుకులు తీసుకోలేదని సమాచారం.

బనగానపల్లెలో రేషన్ దుకాణాల వివరాలు

మండలం	రేషన్‌దుకాణాలు	రేషన్‌కార్డులు
కోవెలకుంట్ల	34	14064
కొలిమిగుండ్ల	44	16227
బనగానపల్లె	58	36139
సంజామల	31	12062
అవుకు	41	16074



అవుకులో రేషన్ కోసం క్యూలో ఉన్న కార్డుదారులు

డోర్ డెలివరి రద్దుతో అవస్థలు



గతంలో బియ్యం, చక్కెర, తదితర నిత్యావసర సరుకులు ఇంటి వద్దే ఇచ్చేవారు. ఈ నెల నుంచి ఆ వ్యవస్థ రద్దు కావడంతో తిరిగి రేషన్‌షాపులకు వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సి ఉంది. ప్రతి నెలా సరుకులు తీసుకునేందుకు పనులకు మానుకుని రేషన్ దుకాణాలకు వెళ్లాల్సిన పరిస్థితి. సర్వర్ మొరాయిస్తే గంటల తరబడి షాపుల వద్ద వేచి ఉండి సరుకులు తెచ్చుకోవాలి.

–వెంకటేశ్వర్లు, జోళదరాశి, కోవెలకుంట్ల

ఇబ్బందిగా ఉంది

రేషన్‌షాపులో పంపిణీ చేసిన బియ్యంను ఇంటికి మోసుకురావడానికి ఇబ్బంది పడ్డాను. సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడంతో షాపు వద్ద గంటల తరబడి వేసి ఉండి సరుకులు తీసుకోవాల్సి వచ్చింది. డోర్ డెలివరిని రద్దు చేయడంతో రేషన్‌కష్టాలు తప్పడం లేదు.

–ఆదినారాయణ, ఆకుమల్ల, సంజామల

ఇంటి దగ్గరే పంపిణీ చేయాలి



గతంలో ఎండీయూ వాహనం ద్వారా ఇంటి వద్దే సరుకులు పంపిణీ చేసేవారు. మాలాంటి వృద్ధులకు సౌకర్యంగా ఉండేది. ఇప్పుడు ఆ విధానం లేదని అంటున్నారు. నేను నివాసం ఉన్న ఇంటి నుంచి కి.మీ దూరంలో రేషన్ దుకాణం ఉంది. ఇప్పుడు అక్కడికి వెళ్లి తీసుకోవాలని అంటున్నారు. ఇంటి వద్దే సరుకులు అందిస్తే బాగుంటుంది.

–ఖలీల్, బేతంచెర్ల

డోన్ టౌన్: పట్టణంలోని పలు దుకాణాల్లో ఆర్డీఓ నరసింహులు, తహసీల్దార్ నాగమణి రేషన్ పంపిణీ ప్రారంభించారు. మొదటి రోజే మిషన్లు మొరాయించడంతో పలు దుకాణాల్లో ప్రజలు వేచి ఉంటూ ఇదేం ఖర్మరా బాబు అంటూ అసహనం వ్యక్తం చేశారు.

పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలి



మాజీ ఎమ్మెల్యే కాటసానిని సత్కరిస్తున్న చిన్నబాబు

కోవెలకుంట్ల/బనగానపల్లె: వైఎస్సార్‌సీపీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఆ పార్టీ బనగానపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సూచించారు. సంజామల మండలం పేరుసోములకు చెందిన మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చిన్నబాబును రెండు రోజుల క్రితం అధిష్టానం పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించింది. ఈ మేరకు ఆయన ఆదివారం బనగానపల్లెలో మాజీ ఎమ్మెల్యేను కలిసి ఘనంగా సత్కరించారు. కాటసాని మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపే ధ్యేయంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. నాయకులు రాంభూపాల్‌రెడ్డి, దనికొండ నాగేశ్వరరెడ్డి, ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అలజడి సృష్టిస్తే కఠిన చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ

బేతంచెర్ల: రౌడీషీటర్లు గ్రామాల్లో అలజడి సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కుటుంబ సభ్యుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. గతంలో చేసిన తప్పులు పునరావృతం అయితే జీవితాంతం జైలు జీవితం గడపాల్సి వస్తుందని హెచ్చరించారు. సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, సొంత నిర్ణయాలు తీసుకోవద్దని హితవుపలికారు. అందరిపై నిఘా ఉంటుందని తెలిపారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

ప్యాపిలి: మండల పరిధిలోని ఎన్‌రాచర్ల గ్రామంలో హనుమత్ సమేత సీతారామ లక్ష్మణ స్వాముల విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ఆదివారం బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీల్లో బాపట్ల జిల్లా వేటపాలెంకు చెందిన శివరామకృష్ణ వృషభాలు విజేతగా నిలిచి రూ. 80 వేలు కైవసం చేసుకున్నాయి. కర్నూలు జిల్లా రుద్రవరం గ్రామానికి చెందిన మైమున్, గోపాల్‌గౌడ్ వృషభాలు ద్వితీయ స్థానంలో నిలిచి రూ. 60 వేలు గెలుపొందాయి. నంద్యాల జిల్లా పెద్దకొట్టాలకు చెందిన బోరెడ్డి కేశవరెడ్డి వృషభాలు తృతీయ స్థానంలో నిలిచి రూ. 40 వేలు, అనంతపురం జిల్లా యంగనపల్లెకు చెందిన ఇంద్రారెడ్డి, వాసుదేవరెడ్డి వృషభాలు నాలుగో స్థానంలో నిలిచి రూ. 30 వేలు చొప్పున గెలుపొందాయి. మొత్తం పది జతల వృషభాలు పోటీల్లో పాల్గొనగా అన్ని వృషభాలకు బహుమతులు అందజేశారు.

సలహాలు పాటిస్తే పెట్టుబడి తగ్గించుకోవచ్చు

బనగానపల్లె: రైతులు శాస్త్రీయ సలహాలు పాటించి పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవాలని.. అధిక దిగుబడులు సాధించాలని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ రత్న కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా మండలంలోని రామతీర్థం చెరువుపల్లె, పలుకూరు గ్రామాల్లో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నకుమార్ మాట్లాడుతూ.. రైతులు కేవలం వ్యవసాయం మాత్రమే కాకుండా అనుబంధ రంగాలైన పశుపోషణ, ఉద్యానపంటలపై దృష్టి సారించాలని సూచించారు. కేవీకే శాస్త్రవేత్త రవిగౌడ్ ఖరీఫ్‌కు ముందు చేపట్టాల్సిన సన్నద్ధత కార్యక్రమాలపై వివరించారు. మొక్కజొన్న, కంది, వరి పంటల్లో సస్యరక్ష చర్యలు, విత్తనశుద్ధి, తెగుళ్లు, పురుగుల మందులు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీఏఆర్ శాస్త్రవేత్త డాక్టర్ సుగన్న, మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

డీఎస్సీ మోడల్ టెస్ట్‌కు స్పందన

బనగానపల్లె రూరల్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన డీఎస్సీ మోడల్ టెస్ట్‌కు అభ్యర్థుల నుంచి స్పందన లభించింది. మొత్తం 30 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరిగింది. హెచ్‌ఎం రామకృష్ణ, పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంపుల్లారెడ్డి, మండల అధ్యక్షుడు దస్తగిరి, నాయకులు షరీఫ్, లక్ష్మీనారాయణరెడ్డి, సుబ్రమణ్యం, రఫీ పాల్గొన్నారు.



మోడల్ టెస్ట్‌కు హాజరైన అభ్యర్థులు

కరాటేలో వివిధ బెల్టుల ప్రదానం



వివిధ బెల్టులు సాధించిన విద్యార్థులతో సీఐ

డోన్: స్థానిక అక్షర స్కూల్‌లో సి కోశై కరాటే ఇంటర్నేషనల్ ఇండియా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కరాటే విద్యార్థులకు బెల్టు గ్రేడింగ్ నిర్వహించారు. అసోసియేషన్ చీఫ్ ఎగ్జామినర్‌గా ఉమ్మడి కర్నూలు జిల్లా కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ బెల్ట్ గ్రేడింగ్ చేశారు. రాజాసింగ్, నిఖిలేష్ బ్లాక్‌బెల్ట్, అభిరాం బ్రౌన్ బెల్ట్, ఆసిఫా, సాయికీర్తన, అభినయ, లౌఖ్యారెడ్డి బ్లూ బెల్ట్, భానుప్రకాష్, సాయిచరణ్, అశ్వర్థరెడ్డి గ్రీన్‌బెల్ట్, వేదాన్ష్, చక్రధర్ ఆరెంజ్ బెల్ట్, మహాజన్‌బీ, అన్విణి, హేమంత్, మహాలక్ష్మి, షరీఫ్, విశ్వం ఎల్లో బెల్టులు సాధించారని కరాటే మాస్టర్ రమణ తెలిపారు. డోన్ సీఐ ఇంతియాజ్ బాషా ప్రోత్సాహక బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు.

రాష్ట్రంలో అరాచక పాలన

- ఈ నెల 4న వెన్నుపోటు దినం
- రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు



వెన్నుపోటు దినం వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ నాయకులు

డోన్: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అధికార దుర్వినియోగం చేస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయిస్తోందే తప్ప రాష్ట్రాభివృద్ధిని పట్టించుకోవడం లేదని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, డోన్, బేతంచెర్ల ఎంపీపీలు రేగటి రాజశేఖర్‌రెడ్డి, బుగ్గన నాగభూషణంరెడ్డి, బేతంచెర్ల మున్సిపల్ చైర్మన్ చలంరెడ్డి ఆరోపించారు. ఈనెల 4వ తేదీ నాటికి కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్న సందర్భంగా ప్రజలతో కలిసి వైఎస్సార్‌సీపీ వెన్నుపోటు దినంగా పాటిస్తుందన్నారు. ఆదివారం మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్, పార్టీ వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుపసాద్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్‌లు మల్లెంపల్లె రామచంద్రుడు, బోరెడ్డి పుల్లారెడ్డి, పిట్టల జాకీర్, క్వాలిటీ అబ్దుల్లాతో కలిసి వెన్నుపోటు దినం కార్యక్రమ పోస్టర్లను విడుదల చేశారు.

ఏడాది పాలనలో 390 హత్యలు

ఏడాది కూటమి పాలనలో రాష్ట్రంలో 390 మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు హత్యకు గురయ్యారని తెలిపారు. తమ పార్టీ నాయకులపై 2,466 అక్రమ కేసులు బనాయించిందని ఆరోపించారు. దళితులపై దాడులు, సాంఘిక బహిష్కరణలు లాంటి అనేక సంఘటనలు హెచ్చు మీరిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రాజ్యాంగానికి బదులు రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. రిటైర్డ్ ప్రభుత్వ అధికారులైన క్రిష్ణమోహన్ రెడ్డి, ధనుంజయరెడ్డి వంటి అధికారులపై కూడా రెడ్‌బుక్ రాజ్యాంగం పేరిట రాక్షసత్వంగా ప్రవర్తిస్తున్నారన్నారు. ఆలయాల్లో అపచారాలు ఎన్ని జరిగినా పట్టించుకోవడం లేదని, అంతులేని ప్రజాధనం వృధా చేస్తున్నారని పేర్కొన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను గాలికొదిలేసి విద్యారంగం, వ్యవసాయం , పారిశ్రామిక రంగాన్ని విధ్వంసం చేశారన్నారు. వీటన్నింటికీ వ్యతిరేకంగా ఈనెల 4న వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నామని తెలిపారు. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు, మురళీకృష్ణ, ఎద్దులన్న, రాఘవేంద్ర, తిరుమలేశ్వరరెడ్డి, నాగభూషణంరెడ్డి, విశ్వనాథరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, పెయింటర్ వెంకటేష్, గూని నాగరాజు, సోమేష్ యాదవ్, మిట్టా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

సంజామల: మండలంలో వ్యవసాయానికి సోమవారం నుంచి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఇన్‌చార్జ్ ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఈ సమయాల్లో విద్యుత్ సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

చౌడేశ్వరిదేవి ఆలయాభివృద్ధికి విరాళం

బనగానపల్లె రూరల్: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధి ఇదే గ్రామానికి చెందిన కీశేలు సన్నల సోమశేఖర్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన భార్య సన్నల లక్ష్మీదేవి, కుమారుడు వేణుసాయినాథ్‌రెడ్డి రూ.25116 విరాళాన్ని అందించినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ ఆదివారం తెలిపారు. ఈ మేరకు దాత కుటుంబ సభ్యులను సన్మానించి అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు.

'వెన్నుపోటు దినం' జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కోవెలకుంట్ల: అపద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కూటమి సర్కార్‌పై చేపట్టిన 'వెన్నుపోటు దినం' ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బీవీ నాగార్జునరెడ్డి, ఏపీ ఎన్‌జీఓ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గువ్వల రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం కోవెలకుంట్లలో బీవీ స్వగృహంలో ఆ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ పథకాలతో పాటు మరో 147 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏ ఒక్క హామీ అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. బనగానపల్లెలో ఈ నెల 4వ తేదీ నిర్వహించ తలపెట్టిన ఆందోళన కార్యక్రమానికి మండలంలోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకుడు కానాల రవీంద్రనాథరెడ్డి, పార్టీ నాయకులు చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, అమడాల భాస్కర్‌రెడ్డి, పోతం రాంమోహన్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, సూర్యశేఖర్‌రెడ్డి, దశరాథరామిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, అక్బర్ బాషా, రఫీ, రాంభూపాల్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, జశ్వంత్‌రెడ్డి, జనార్దన్, కిషోర్, మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్యాపిలి: నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



బనగానపల్లె: నందివర్గం జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

అపూర్వ కలయిక

వారంతా ప్రభుత్వ పాఠశాలల్లో ఏళ్ల కిందట కలిసి చదివారు. అనంతరం ఉన్నత చదువుల కోసం విడిపోయారు. విద్యాభ్యాసం తర్వాత ఉద్యోగాలు, సంసార జీవనపయనంలో ఏళ్లు గడిచిపోయాయి. మళ్లీ ఇన్నేళ్ల తరువాత ఒకేచోట కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి దశలో చేసిన అల్లరి, చిలిపి చేష్టలను గుర్తు చేసుకుని సరదాగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. ప్యాపిలి మండలం జలదుర్గం జెడ్పీ ఉన్నత పాఠశాల(1994–95), నందివర్గం జెడ్పీ ఉన్నత పాఠశాల(1994–99), సిమెంట్‌నగర్ ఉన్నత పాఠశాల (2002–03), సంజామల ప్రభుత్వ పాఠశాల (1986–87) పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆయా పాఠశాలల్లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

–ప్యాపిలి/బనగానపల్లె రూరల్/బేతంచెర్ల/సంజామల



బేతంచెర్లలో..



సంజామలలో 1986-87 బ్యాచ్ పూర్వ విద్యార్థులు